క్లుప్తంగా

సీఎం సలహాదారును కలిసిన గల్ఫ్ జేఏసీ బృందం


వినతిపత్రం ఇస్తున్న జేఏసీ ప్రతినిధులు

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి వచ్చే బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని గల్ఫ్ జేఏసీ బృందం సీఎం సలహాదారు నరేందర్ రెడ్డిని హైదరాబాద్ సెక్రటేరియట్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (గల్ఫ్ బోర్డు) ఏర్పాటు చేయాలని, సమగ్ర ప్రవాస భారతీయుల విధానం (ఎన్నారై పాలసీ) ప్రవేశపెట్టాలని, గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు గురించి స్పష్టమైన జీవో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, మంద భీం రెడ్డి, తోట ధర్మేందర్, గంగుల మురళీధర్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న చైర్మన్, కమిషనర్

కోరుట్ల: వనమహోత్సవంలో ప్రతీ ఒక్కరుమొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ శివారులోని సాయిబాబా ఆలయ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ సమతుల్యతకు మొక్కలు ఉపయోగ పడుతాయని, అందరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ బద్ది సుజాత, మాజీ వైస్ ఎంపీపీ కాశిరెడ్డి మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పారిశుధ్య నిర్వాహణపై అధికారులు మంగళవారం పలు గ్రామాల్లో విస్తృతంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మురికి కాల్వలను శుభ్రం చేయడం, ఇళ్ల పరిసరాల్లో ఉన్న నీటి నిల్వలను తొలగించడం, చెత్త లేకుండా చేయడం, దోమల నివారణ మందులను పిచికారీ చేయడం, రోడ్ల వెంట బ్లీచింగ్ వేసే పనులు చేపట్టారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో లచ్చాలు, ఎంపీవో వెంకటకృష్ణరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఎంలు, ఆశాలు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ లావణ్య

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ సహాయ సంచాలకులు లావణ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, ఈపాస్ మిషన్లు పరిశీలించారు. డీలర్లు ఈపాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. విత్తనాలు, పురుగు మందులు అమ్మేటపుడు రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈవో నరేశ్ పాల్గొన్నారు.

వేములకుర్తిలో గుడుంబా పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచరంతో ఎస్సై అనిల్ తన సిబ్బందితో వెళ్లి 10 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. నిందితుడు గుండవేని భూమన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ఇటిక్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


మెట్‌పల్లి రూరల్: ప్లకార్డులతో సూపర్‌వైజర్ హైమతి, అంగన్‌వాడీ టీచర్లు


జగిత్యాల: ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' ర్యాలీలు

జగిత్యాల/కోరుట్ల రూరల్/ పెగడపల్లి/మెట్‌పల్లి రూరల్/వెల్గటూర్/రాయికల్: 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రెండేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, పిల్లలకు ప్రీస్కూల్ విద్య, మంచిపోషకాహారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో సీడీపీవో వరలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


శివాజీ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

ఆదమరిస్తే అంతే సంగతి ..!

కోరుట్లటౌన్: పట్టణంలోని శివాజీరోడ్డులో సిమెంట్ రోడ్డు దెబ్బతింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ఈ రహదారి వెంట వెళ్లడం మరింత ప్రమాదకరంగా మారింది. కొద్ది దూరంలో రెండు చోట్ల గుంతలు ఉండడంతో పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వెంటనే బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


శివాజీ రోడ్డుపై దెబ్బతిన్న స్లాబు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

జగిత్యాల: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ ఏర్పాటు చేశామని, దీనిని వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులిచ్చారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అత్యధికంగా కుక్కలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయని, పారిశుధ్యంపై సైతం చర్యలు తీసుకుంటున్నామని, ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఏ సమస్య అయినా నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

కుక్కలు,కోతులతో రక్షణ కల్పించాలి

జగిత్యాలటౌన్: పట్టణంలోని ధరూర్ క్యాంపు, వినాయకనగర్, శ్రీనగర్ కాలనీ, హౌజింగ్‌బోర్డు ప్రాంతాల్లో కుక్కలు, కోతుల బెడద తట్టుకోలేక పోతున్నామని కుక్కలు, కోతులు చిన్నారులపై దాడులు చేస్తున్నాయని బీజేపీ నాయకురాలు గడ్డల లక్ష్మి తెలిపారు. మంగళవారం జగిత్యాల మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. బల్దియా అదికారులు స్పందించి కోతులు, కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి సంరక్షణ కేంద్రాలకు తరలించి స్థానిక ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ లో చేర్చాలి

మల్లాపూర్: ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్ అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో ర్యాలీ చేపట్టి తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన ముదిరాజ్ కులస్తులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలంటే బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి చేర్చాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కి ఏటా రూ.1000 కోట్లు కేటాయించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, యువత జిల్లా అధ్యక్షుడు ఉడుమల్ల చరణ్, నాయకులు దండవేని రాజేందర్, బొజ్జ గంగాధర్, జిట్టవేని చిన్ననర్సయ్య, ఉసికెల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: ముదిరాజ్‌లను బీసీ- ఏలో చేర్చాలని ముదిరాజ్ నాయకులు తహసీల్దార్ కృష్ణ చైతన్యకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నీలం పెద్దులు, వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి రాజన్న, నాయకులు బల్ల పోశన్న, వీరవేణి రాజమల్లయ్య, లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈత, తాటిచెట్లు తొలగించిన వారిపై చర్యలు చేపట్టాలి

జగిత్యాలరూరల్: ఈత, తాటిచెట్లు తొలగించిన వారిపై చర్యలు చేపట్టాలని జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం మోరపల్లి గౌడ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ వద్ద గతంలో ఉపాధిహామీలో 150 ఈత, తాటిచెట్లు నాటి, సంరక్షించామని, గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డి అనే వ్యక్తి అనుమతి లేకుండా ఈత, తాటిచెట్లు తొలగించారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు సల్లూరి శ్రీకాంత్, కొల్లూరి రంజిత్, రాము, అజయ్, నరేశ్, అశోక్ పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

రాయికల్ మున్సిపల్ అభివృద్ధిపై దృష్టి సారించాలి

రాయికల్: అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రాయికల్ మున్సిపాలిటీఅభివృద్ధిపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్ గౌడ్, మహేందర్ అన్నారు. మంగళవారం మాట్లాడారు. తాము ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను విమర్శించడం లేదని, కేవలం రాయికల్ పట్టణాభివృద్ధిపైనే దృష్టి సారించాలని కోరామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్,సత్యనారాయణ,లింగంగౌడ్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ ఎస్సీ గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ మంగళవారం ఎంపీడీవో చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలో కోతుల బెడదతో మెట్లపై ఉన్న కప్పును ధ్వంసం చేస్తున్నాయని, వర్షం పడినప్పుడు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట మాల మహానాడు రాష్ట్ర నాయకుడు వేల్పుల ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై విక్రయాలు కొనసాగిస్తే చర్యలు

కోరుట్ల: పట్టణంలోని రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు అన్నారు. పట్టణంలో మంగళవారం తనిఖీలు నిర్వహించి రోడ్డుపక్క ఫుట్‌పాత్‌లపై విక్రయాలు కొనసాగిస్తున్న వారి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరోసారి ఫుట్‌పాత్‌లపై విక్రయాలు కొనసాగిస్తే రూ. 5000 జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ తిరుపతి హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు ప్రవీణ్, రమ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో బాలుడికి గాయాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళగొండు గూడెంలో ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. గూడెంకు చెందిన పెంద్రం మారుతి కుమారుడు దేవేందర్ ఆడుకుంటుండగా కుక్క మొఖం, చేతులు, కాళ్లపై కరిచింది. బాలుడి అరుపులతో గూడెం వాసులు అక్కడికి చేరుకోగా కుక్క వెళ్లిపోయింది. దేవేందర్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వీధి కుక్కలను నియంత్రించాలని వినతి

కోరుట్ల: పట్టణంలోని 28వ వార్డులో వీధి కుక్కలను నియంత్రించాలని పట్టణానికి చెందిన న్యాయవాది సుతారి శ్రీనివాస్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతికి వినతిపత్రం సమర్పించారు. వార్డులో కుక్కలు గుంపులుగుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయని ,చిన్న పిల్లలు బయటకు వెళ్లేందుకు భయపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. వర్షాకాలంలో కుక్కలకు రేబీస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని, కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.

డీపీఆర్ నివేదికల కోసం మంత్రికి జీవన్‌రెడ్డి లేఖ

సారంగాపూర్: మండల కేంద్రంలోని చింతలచెరువుకు ఎస్సారెస్పీ కాల్వ నిర్మాణం, బీర్‌పూర్ మండలం గోదావరిపై రెండు చెక్‌డ్యాల నిర్మాణాలకు నీటిపారుదల శాఖ అధికారులు డీపీఆర్ (డిటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) నివేదికలు అందించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ నిర్మాణాలకు అవసరమైన మేరకు నిధులు మంజూరుకు సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు డీపీఆర్ నివేదికలు రూపొందించేలా ఆదేశించాలని మంత్రిని ఎమ్మెల్సీ లేఖలో కోరారు.

'రుణమాఫీ అమలుకు షరతులా?'

మేడిపల్లి: రుణమాఫీపై హామీ ఇచ్చేటప్పుడు లేని షరతులు అమలు చేసేటప్పుడు ఎందుకని, చేతకాకపోతే సీఎం రేవంత్ రెడ్డి పదవికి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ క్యాతం దశరథ్ రెడ్డి డిమాండ్ చేశారు. అధికారం రాకముందు రుణమాఫీ పై ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయలేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణ శివారులోని ఓ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిచెన్‌ను సందర్శించి ఆహార పదార్థాలను, ఫుడ్ కలర్స్‌ను పరిశీలించారు. పలు పదార్థాలు కాలం చెల్లినవి ఉన్నట్లుగా గుర్తించి బయట పడేయించారు. రసాయనాలతో తయారు చేసిన ఫుడ్ కలర్స్ వాడొద్దని నిర్వాహకులకు హెచ్చరించారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష,తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాలటౌన్: నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 19 శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్టులో డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ ఖాళీల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి అర్హత విద్యార్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు రూ.15 వేల వేతనం, ఉచిత భోజనంతో పాటు వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంలో గురువారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రేగుల భూమానందం మంగళవారం తెలిపారు. హైదరాబాద్ కు చెందిన మెడ్ విజన్ కంటి ఆస్పత్రి వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పిల్లలకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు ఉచితంగా అందిస్తారని , శస్త్ర చికిత్స అవసరమున్న వారికి శస్త్ర చికిత్స చేసి ఇంటివరకూ తీసుకవస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన ఉండాలి

జగిత్యాల: ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని, వారికి గుడ్,బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని మహిళ సాధికారత కో-ఆర్డినేటర్ అశ్విని అన్నారు. మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొబైల్ సోషల్ మీడియా అత్యధికంగా వినియోగం వల్ల దుష్ప్రభావాలు వస్తున్నాయని, ఆడపిల్లలకు వీటిని దూరంగా ఉంచేలా చూడాలన్నారు. అలాగే బాల్య వివాహాలు నిషేదమని, మహిళా రక్షణ చట్టాలపై సైతం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ శైలజ పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

రాయికల్: రాయికల్ ప్రభుత్వాస్పత్రిని మంగళవారం వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ సుదక్షిణదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులందరూ సమయపాలన పాటించాలని, అదే విధంగా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దోమల నివారణతోనే వ్యాధుల నియంత్రణ

మల్యాల: దోమలు వృద్ధి చెందకుండా దోమ లార్వా దశలోనే నివారించేలా ఆల్ఫా సైఫర్ మెత్రిన్ పిచికారీ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎన్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం దోమల నివారణ కోసం పిచికారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 95 గురుకుల కళాశాలల్లో పిచికారి చేసేలా ప్రత్యేక టీం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెలలో జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల్లో పిచికారీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అసిస్టెంట్ సైంటిస్ట్‌గా ఇప్పపెల్లి యువకుడు

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లికి చెందిన యాగండ్ల నవీన్‌గౌడ్ అసిస్టెంట్ సైంటిస్ట్‌గా ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. నవీన్‌గౌడ్ 2016 సంవత్సరంలో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం రైల్వే శాఖలో లోకో పైలట్‌గా బెల్లంపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా భారత వాతావరణ శాఖ ఢిల్లీలో అసిస్టెంట్ సైంటిస్ట్‌గా ఎంపికైనట్లు సమాచారం వచ్చిందని నవీన్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నవీన్ గౌడ్‌ను బీసీ సంక్షేమశాఖ జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, గ్రామస్తులు అభినందించారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రానికి చెందిన బాస రాము కొద్ది రోజుల క్రితం మొబైల్ ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఎస్ఆర్ పోర్టల్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూర్ జిల్లాలో ఫోన్ ఉన్నట్లు గుర్తించి అక్కడి నుంచి తెప్పించి మొబైల్ ఫోన్‌ను ఎస్సై రాముకు అప్పగించారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వానాకాలం పంటల సాగులో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి అన్నారు. రైతునేస్తంలో భాగంగా రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. శాస్త్రవేత్తలు శ్రీదేవి,డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పంటల్లో వివిధ రకాల తెగుళ్లపై వివరించారు.కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు నరేశ్, శ్యామ్ కుమార్, హరీశ్, రైతులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలి

కథలాపూర్: గ్రామాల్లో ఇళ్ల ఆవరణలో వర్షపు నీటి నిల్వలు లేకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో ప్రవీణ్ అన్నారు. మండలంలోని పెగ్గెర్ల, భూషణరావుపేట గ్రామాల్లో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. పలువరి ఇళ్లను తనిఖీ చేసి కుండీలల్లో, టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యదర్శులు ఎం.డీ గపూర్, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

కోరుట్ల: అక్రమంగా ఇసుక తరలించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కిషన్ తెలిపారు. మండలంలోని నాగులపేట శివారులోని వాగునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది మంగళవారం పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మండల ప్రధాన కార్యదర్శిగా చేపూరి నాగరాజు

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా చేపూరి నాగరాజును నియమిస్తూ మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండల కార్యదర్శిగా పుప్పాల శ్రీధర్, అధికార ప్రతినిధిగా చొప్పరి ఎర్రన్నను నియమించారు. మంగళవారం వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మార్గం నర్సారెడ్డి, మాదం వినోద్, లాజర్, సాయిని గంగారెడ్డి, లచ్చ నాయక్, జిల్లా రమేశ్, ఉతదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా ఎలిగేటి అనిల్

రాయికల్: బీఆర్ఎస్ రాయికల్ పట్టణ అధ్యక్షుడిగా రాయికల్‌కు చెందిన ఎలిగేటి అనిల్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

రుణమాఫీపై కొత్త ఆంక్షలు వద్దు

కథలాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల పంటల రుణమాఫీపై కొత్త ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టొద్దని కథలాపూర్ మండలానికి చెందిన రైతు సంఘం నాయకులు గుగ్లోత్ రవినాయక్, తీట్ల శంకర్ మంగళవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్స్‌లో ట్విట్ చేసి తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (లోకల్ కోర్టు) సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ ఏడీఈ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల రైతులు, గృహ, వాణిజ్య, వ్యాపార వినియోగదారులు హాజరుకావాలని, సమస్యలపై ఫోరం చైర్మన్ ఎస్.రామకృష్ణ, మెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

పులి వేషాలతో ఇబ్బంది పెట్టొద్దు

మల్యాల: మొహర్రం వేడుకల సందర్భంగా పులి వేషాలు వేసే యువకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రజలను ఇబ్బంది పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మల్యాల ఎస్సై నరేశ్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఎస్సై నరేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొహర్రం శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. యువకులు పులి వేషాలు వేసి, ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

మెట్‌పల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో లాగా స్థానిక ఎన్నికల్లో అత్యధిక సీట్లను కైవసం చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్‌కుమార్,బోగ శ్రావణి, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

మల్యాల: మండల కేంద్రానికి చెందిన బెక్కం లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, విషయాన్ని తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థికసాయం పార్టీ కార్యకర్తల ద్వారా అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్, మ్యాక లక్ష్మణ్, తిరుపతి, వంశీ, లక్ష్మణాచారి, సురేశ్, రవి పాల్గొన్నారు.

నడికుడలో సీత్లా భవాని వేడుకలు

మల్లాపూర్: మండలంలోని నడికుడ గ్రామ శివారు అటవీ ప్రాంతాల్లో లంబాడీ గిరిజనులు మంగళవారం సీత్లా భవానీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం లంబాడి గిరిజనులు నైవేద్యాలతో ఊరేగింపుగా అటవీ ప్రాంతంలోకి తరలివెళ్లారు. సీత్లా భవాని, తుల్జ భవాని, మసూరి భవాని, అంబా భవాని, దుర్గాభవాని మాతలకు పరమాన్నం సమర్పించారు. అనంతరం గిరిజన మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య రుక్మా, గిరిజన పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న గిరిజన మహిళలు